విద్యుత్ రంగంలో కూకట్‌పల్లి రోల్ మోడల్ కావాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ప్రత్యేక సమావేశం
- పాల్గొన్న విద్యుత్‌శాఖ అధికారులు, కార్పొరేటర్లు
- విద్యుత్ సమస్యలపై నివేదిక సిద్ధం చేయాలి: టీఎస్ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్స్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమీక్షా సమావేశంలో పాల్గొన్న విద్యుత్ అధికారులు, కార్పొరేటర్లు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెల కొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీఎస్ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నివాసంలో నియోజకవర్గ విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 9 డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు పాల్గొన్న ఈ సమావేశంలో పలు సమస్యలను ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.

◆ డివిజన్లలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని... ప్రమాదకరంగా మారిన స్తంభాలు, వైర్లను తొలగించాలని.. ఇనుప స్తంభాల స్థానంలో వేరే స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలన్నారు. తరుచూ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయో తెలుసుకుని పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రతిరోజు విద్యుత్ సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని తక్షణమే పరిష్కారం చూపి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.

మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు...

◆ విద్యుత్ రంగంలో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి కేటీఆర్ ప్రణాళికలు రూపొందించారని ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. దానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పంతో తెలంగాణలో 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయగల్గుతున్నామని పేర్కొన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సాహిస్తూ ఎంతో మందికి జీవనోపాధి కల్పిస్తున్నారని అన్నారు. భాగ్య నగరం నేడు ప్రపంచ వేదికపై అత్యున్నత నగరాల స్థాయికి చేరుకుందన్నారు. మన నగరం ఇలాగే దినదినాభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుకు వెళ్లాలని సూచించారు.

అధికారులపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి..

◆ బోయిన్‌పల్లి ఏఈ, అధికారులపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక అధికారులు ఫోన్లు ఎత్తడం లేదనే ఫిర్యాదులు వినియోగదారుల నుంచి నిత్యం వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పద్ధతి మార్చుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. గతంలో ప్రజల వద్దకే అధికారుల కార్యక్రమం ఉండేదన్నారు. ప్రస్తుతం తన పాదయాత్రల్లో అన్ని విభాగాల అధికారులు హాజరవుతున్నా... ఒక్క విద్యుత్ అధికారులు మాత్రం రావడం లేదన్నారు. దీంతో ప్రజలు తమ దృష్టికి తెచ్చిన విద్యుత్ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించలేకపోతున్నామని అధికారులపై మండిపడ్డారు. నిర్లక్ష్యంగా వ్యవరిస్తే చర్యలు తప్పవని తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సీజీఎం నర్సింహస్వామి, ఎస్ఈలు చంద్రశేఖర్, రవికుమార్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సోమవారంలోపు సమస్యలపై నివేదిక అందించాలి..

ఎక్కడైతే సమస్యలు ఉన్నాయో వాటిని గుర్తించి సోమవారం లోపు ప్రణాళికలు సిద్ధం చేసి తన వద్దకు తీసుకురావాలని టీఎస్ ఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ ఆపరేషన్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. నిధులు మంజూరు చేసి పనులు చేయిస్తామని అన్నారు. ఆగస్టు 15వ తేదీలోపు విద్యుత్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాధారణ ప్రజలు ఎవరూ ఫోన్ చేసినా అందుబాటులో ఉండాలని.. ప్రతి ఒక్కరికి సమాధానం చెప్పాలని సూచించారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్య నియోజకవర్గంలోని ఏఏ డివిజన్లలో ఉందో గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయం జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించాలని సూచించారు.

ఆగస్టు 1 నుంచి ఎమ్మెల్యే పాదయాత్ర

- బోయిన్‌పల్లి డివిజన్ నుంచి షురూ..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఆగస్టు 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 23వ తేదీ వరకు పాదయాత్ర చేపట్టి మిగిలి ఉన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన తొమ్మిదిన్నర సంవత్సరాలుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గంలో దీర్ఘకాలిక, స్వల్పకాలిక సమస్యను వేలాది కోట్ల రూపాయలు వెచ్చించి పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఆగస్టు 1 నుంచి ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పర్యటిస్తానన్నారు.

పాదయాత్ర వివరాలు....

ఆగస్టు 1 నుంచి 6 వరకు బోయినపల్లి డివిజన్
ఆగస్టు 7 నుంచి 11 వరకు బాలానగర్ డివిజన్
ఆగస్టు 12 నుంచి 17 వరకు ఫతేనగర్ డివిజన్
ఆగస్టు 18 నుంచి 22 వరకు బేగంపేట డివిజన్
ఆగస్టు 23 నుంచి 28 వరకు మూసాపేట డివిజన్
29 నుంచి సెప్టెంబర్ 3 వరకు అల్లాపూర్ డివిజన్
సెప్టెంబర్ 3 నుంచి 9 వరకు కూకట్‌పల్లి డివిజన్
సెప్టెంబర్ 10 నుంచి 15 వరకు బాలాజీనగర్ డివిజన్
సెప్టెంబర్ 16 నుంచి 22 వరకు కేపీహెచ్‌బీ డివిజన్

23వ తేదీ పాదయాత్ర ముగింపు సందర్భంగా కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలి

బాలానగర్: కూకట్‌పల్లి మండల పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న పేదలకు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. సోషల్ ఎకనామిక్ సర్వే నిర్వహించి అసలైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలని శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వర్షపు నీరు నిల్వకుండా రోడ్డు ఎత్తు పెంచాలి

ఆల్విన్‌కాలనీ: దత్తాత్రేయ కాలనీలోని ఓ వీధిలో వర్షపు నీరు నిల్వ ఉంటోందని.. ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించి సమస్యను స్వయంగా పరిశీలించారు. భవిష్యత్‌లో వర్షపు నీరు నిల్వకుండా సీసీరోడ్డు ఎత్తు పెంచాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, రాములుగౌడ్, జగదీష్, కుర్మయ్య, మోసిన్, సర్దార్, నరసింహగౌడ్, హనుమంత్ రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దత్తాత్రేయ కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాంకీ విల్లా, శాతవాహననగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు శివాలయం వెనుక వైపు, శాతవాహననగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు చలో ఉస్మానియా

కూకట్‌పల్లి: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్‌తో ఈనెల 15వ తేదీన చలో ఉస్మానియా మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాక్ పేర్కింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం జేఎన్‌టీయూహెచ్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకులు సంఘం సభ్యులు ఆవిష్కరించారు. ఈ మహాధర్నాకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సురేష్, జనరల్ సెక్రటరీ శివారెడ్డి, డా.శంకర్‌గౌడ్, డా. వెంకటేష్, డా.వంశీరెడ్డి, డా.సుధాకర్, అంజుమ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

బాలానగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బాలానగర్ సీఐ భాస్కర్ తెలిపారు. ఐడీపీఎల్ పోస్ట్ సమీపంలో వెంకటేష్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఈనెల 13వ తేదీ రాత్రి 11గంటల సమయంలో నర్సాపూర్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా వెంకటేష్ (27)ను గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టింది. కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

మోతీనగర్: మూసాపేట డివిజన్ బబ్బుగూడ, అవంతినగర్ తోట ప్రజల సౌకర్యార్థం శుక్రవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన సొంత నిధులతో బోర్ వేయిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం బోర్‌వెల్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకిచ్చిన మాట ప్రకారం ఈరోజు నిలుపుకున్నానని అన్నారు. రాబోయే రోజుల్లో తాను ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూము శ్రావణ్‌కుమార్, సత్యం గంగపుత్ర, అంబటి శ్రీనివాస్, తిరుపతిరావు, గార్లపాటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: బోనాల పండుగ పురస్కరించుకొని శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దేవాలయాలకు 104 చెక్కులు, మొత్తం 33 లక్షల 65 వేల రూపాయలను ఆయా దేవాలయ కమిటి సభ్యులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కులాలు, మతాల వారికి సమ ప్రాధాన్యత ఇస్తూ వారి వారి ఆచార సంప్రదాయాల ప్రకారం వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా బోనాలు, బతుకమ్మ పండుగలు ఇంత విస్తృతం కావడానికి కారణం ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత మాత్మే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జేఈఓ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల జాతరను వైభవంగా నిర్వహించుకోవాలి

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండగను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన 25లక్షల 80 వేల రూపాయల చెక్కులను 90 దేవాలయాల కమిటీలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, జూపల్లి సత్యనారాయణ, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

నిర్మాణ పనులను దశలవారీగా పూర్తి చేస్తాం

బాలానగర్: వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అధికారులకు సూచించారు. అక్షయ ఎన్‌క్లేవ్‌లో జరుగుతున్న నూతన వీడీసీసీ రోడ్డు పనులను శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి. ప్రభాకర్,జి.భాస్కర్‌రెడ్డి, కె.శ్రీరాములు గౌడ్, మహేష్, హరి, పాపరావు, రవి, ప్రకాష్, గోపాల్ నాయక్, సురేందర్‌నాయుడు పాల్గొన్నారు.

పంచశీల స్కూల్‌లో బోనాలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థినులు బోనాలు ఎత్తుకుని ఆకట్టుకున్నారు. పోతరాజుల వేషధారణలో విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థులకు పండగల విశిష్టత తెలిపేందుకే స్కూల్‌లో బోనాలు నిర్వహించామని కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా తొట్టెల ఊరేగింపు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చాకలి బస్తీలోని బబ్లూ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ఊరేగింపులో నియోజకవర్గంలోని వివిధ పార్టీ నాయకులు పాల్గొని పూజలు చేశారు.

గొలుసు దొంగ అరెస్టు

మోతీనగర్: ఓ మహిళ మెడలోని గొలుసును లాక్కొని పరారైన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ ఎ.చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. ఈనెల 12వ తేదీన వివేకానందనగర్‌లో నివాసం ఉండే కిరణాషాపును ఓ మహిళ నిర్వహిస్తోందని.. కార్మికనగర్‌లో నివాసం ఉంటూ ఓ హోటల్‌లో వంటమనిషిగా పనిచేస్తున్న కల్వకుర్తి వెంకటేష్ (42) అగ్గిపెట్టె కొనుగోలు నిమిత్తం కిరాణాషాపుకు వెళ్లి అదును చూసి మహిళ మెడలో ఉన్న గొలుసును తెంచుకొని ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు.

◆ దీంతో ఆమె అల్లాపూర్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీలో భాగంగా అల్లాపూర్ జేకే పాయింట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా గొలుసు తెంచిన విషయాన్ని అంగీకరించాడని తెలిపారు. అతని వద్ద నుంచి ఒక బంగారు పుస్తెల తాడు, అనుమతి పత్రాలు లేనటువంటి ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని వెంకటేష్‌ను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్, శ్రీపతి ఆంజనేయులు

◆ అదేవిధంగా నిందితుడు వెంకటేష్ వివేకానందనగర్‌లో గొలుసు చోరీకి పాల్పడిన రోజే సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవంతినగర్ ప్రాంతంలో ఓ మహిళ మెడలో గొలుసు చోరీకి కూడా ప్రయత్నించాడని ఆయన తెలిపారు. ఇప్పటికే వెంకటేష్‌పై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటుతో పాటు హత్య, నాన్ బెయిలబుల్ వారెంట్ కేసులతో పాటు మరో 8కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. నిందితుడిని పట్టుకునేందుకు చాకచక్యంగా వ్యవహరించిన సీసీఎస్ బాలానగర్, అల్లాపూర్ క్రైమ్ టీమ్ పోలీస్‌లను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో అల్లాపూర్ సీఐ శ్రీపతి ఆంజనేయులు, సీసీఎస్ బాలానగర్ ఇన్‌స్పెక్టర్ బాలరాజ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బాల బోనాల సంబురాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ భవన్‌లో శ్రీరంగం ఫౌండేషన్, శ్రీ సాయి అలేఖ్య సేవా సంఘ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అరుణ అశోక్ అధ్యక్షతన శుక్రవారం బాల బోనాల సంబురాలు జరిగాయి. ఈ వేడుకలో పదో తరగతిలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కాళోజీ ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ హాజరై ప్రసంగించారు. పేద విద్యార్థుల అభ్యున్నతికి సహకారం అందించడం అందరి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, మాజీ ఏబ్లాక్ అధ్యక్షుడు టోచర్, సీనియర్ నాయకుడు తూము వేణు, బాలాజీనగర్ అధ్యక్షుడు కృష్ణరాజ్‌పుత్, ఎడ్ల ప్రభాకర్, చిటుకోరు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: డబుల్ బెడ్ రూమ్ సర్వేలో ఎలాంటి పక్షపాతం వహించినా అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని... ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రలోభ పెట్టినా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎవరైతే నిరుపేదలు ఉన్నారో వారిని సరైన రీతిలో గుర్తించాలని అధికారులకు సూచించారు. ఇది వరకే ఇళ్లు ఉండి తిరిగి మంజూరు చేసుకున్న వారిని గుర్తించి వారి దరఖాస్తు తొలగించాలని ఆదేశించారు. ఎవరైనా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసినా, అధికారులు ఎక్కడైనా తప్పు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఎవరికి ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని తెలిపారు.



నేటి నుంచి లబ్ధిదారుల ఎంపిక

డివిజన్ల వారీగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో మొత్తం 34వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. శనివారం నుంచి ప్రతి డివిజన్‌లో లబ్ధిదారుల ఎంపిక జరగబోతుందన్నారు. త్వరలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న చిరునామా ప్రకారం వారు అక్కడ నివాసం ఉంటేనే వారికి అర్హత కల్పించాలని ఫోన్‌చేసి వివరాలను తీసుకోకూడదని ఆదేశించారు. సొంత ఇళ్లు ఉన్నవారి దరఖాస్తులను స్వీకరించొద్దన్నారు.

నెల రోజుల్లో సర్వేను పూర్తి చేయాలి..

◆ 2016లో దరఖాస్తు చేసుకున్న వారు ఆయా ప్రాంతాల్లో ఉండటం లేదని గతంలోనే జరిగిన సర్వేలో తేలిందన్నారు. ఈ కార్యక్రమాన్ని వార్డుల వారీగా నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ముందుగా బోయినపల్లి నుంచి ప్రారంభం చేయాలని వారానికి ఒక డివిజన్ చొప్పున ఈ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీసీలు రవి కుమార్, రవీందర్‌కుమార్, తహసీల్దార్ గోవర్ధన్, బి.అహల్య, ప్రాజెక్టు అధికారులు, సీఓలు పాల్గొన్నారు.